ప్రజాశక్తి



శనివారం 18 మార్చి 2023 5

శ్రీ సత్యసాయి

హోరాహోరీ..!

◆ వైసిపి, టిడిపి మధ్య తీవ్రమైన పోటీ

◆ ఉత్కంఠతను రేపుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్

◆ 8వ రౌండ్ వరకు వైసిపి అభ్యర్థికి మెజార్టీ

◆ నేడు తుది ఫలితం వెల్లడయ్యే అవకాశం



జెఎన్‌టియులో కౌంటింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ ఓట్ల లెక్కింపు హోరాహోరీగా సాగుతోంది. అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి అభ్యర్థుల మధ్య నువ్వా... నేనా. అన్నట్టుగా వస్తున్న ఫలితాలు ఉత్కంఠతను రేకెత్తిస్తున్నాయి. అనంతపురం జెఎన్‌టియు కళాశాలలో గురువారం ఉదయం ప్రారంభమైన ఓట్ల లెక్కింపు శుక్రవారం రాత్రి అయినా పూర్తవలేదు. అర్ధరాత్రి వరకైనా మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపే సాగింది. ఈ లెక్కింపులోనూ ఎవరికీ పోలైన ఓట్లలో 50 శాతం రానందున రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు శుక్రవారం రాత్రి నుంచి కొనసాగుతోంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పట్టభద్రుల నియోజకవర్గంలో మొత్తం 3,30,124 ఓట్లు ఉంటే 2,44,307 ఓట్లు పోలయ్యాయి. శుక్రవారం రాత్రి వరకు ఎనిమిది రౌండ్లు పూర్తయ్యాయి. ఇందులో 1,92,018 ఓట్లు లెక్కించారు. ఇందులో 15,104 ఓట్లు చెల్లని ఓట్లు కాగా, తక్కిన ఓట్ల లెక్కింపు జరిగింది. ప్రారంభం నుంచి కూడా ప్రతి రౌండులోనూ స్వల్ప మెజార్టీలే అటు వైసిపికిగానీ, ఇటు టిడిపికిగానీ వస్తూ వచ్చాయి. పిడిఎఫ్ అభ్యర్థి నాగరాజు మూడవ స్థానంలో నిలుస్తూ వస్తున్నారు. ఈ ముగ్గురి మధ్యనే ఓట్లు పోలయ్యాయి. తక్కిన 47 మంది అభ్యర్థులకు నామ మాత్రపు ఓట్లే వచ్చాయి.

వివాదం రేపేందుకు అధికారపార్టీ నేతలు ప్రయత్నాలు

హోరాహోరీగా సాగుతున్న ఈ ఓట్ల లెక్కింపు సమయంలో అధికార వైసిపి నేతలు కొందరు పలు దపాలుగా కౌంటింగ్ హాలులో వివాదం రేపేందుకు ప్రయత్నాలు చేశారు. గురువారం రాత్రి సమయంలో నవయుగకాలనీ ఇతర ప్రాంతాల నుంచి కొంత మంది యువకులను కౌంటింగ్ హాలుకు రప్పించి ఎటువంటి కారణం లేకుండానే ఘర్షణ వాతావరణాన్ని సృష్టించే ప్రయత్నం చేశారు. అయితే పోలీసులు సకాలంలో జోక్యం చేసుకుని వచ్చిన వారిని బయటకు తీసుకెళ్లడంతో కౌంటింగ్‌కు అంతరాయం కలుగకుండా సాఫీగా సాగింది. శుక్రవారం నాడు వైసిపి అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డి నేరుగా ఎన్నికల అధికారులపైనే ఆరోపణలు చేయడం చర్చనీయాంశమవుతోంది. కౌంటింగ్ హాలా లేక టిడిపి కార్యాలయమా అని వ్యాఖ్యలు చేశారు. దీన్ని విపక్ష పార్టీల నేతలు తప్పుబట్టారు. ఎన్నికల సంఘం అనుమతి పొందిన వారు మాత్రమే కౌంటింగ్ హాలులోకి అనుమతించడం జరుగుతోంది. ఎవరూ లేకుండా ఉండకూడదనడం సరైంది కాదని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ రకంగా చిన్న విషయానికి వివాదాస్పదంచేసే ప్రయత్నాలను అధికారపార్టీ చేస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రెండో ప్రాధాన్యతనే నిగ్గు తేల్చేనా

మొదటి ప్రాధాన్యతలో ఎవరికీ 50 శాతానికి మించి ఓట్లు వచ్చే సూచనలు కనిపించడం లేదు. దీంతో ఓట్ల లెక్కింపు శనివారం కూడా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. అధికారుల ముందు నుంచే మూడు రోజులు కౌంటింగ్ జరిగే విధంగా ఏర్పాటు చేసియున్నారు. మొదటి ప్రాధాన్యత పూర్తవడంతో రెండో ప్రాధాన్యతలో విజయం ఎవరికి వరిస్తుందన్నది చూడాల్సి ఉంది. తుది ఫలితం శనివారం నాడు వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

పట్టభద్రుల ఓట్లు, మెజార్టీ రౌండ్లు వారీగా

రౌండ్	టిడిపి	వైసిపి	పిడీఎఫ్	మెజార్జీ
1	8801	9664	1838	863 (వైసిపి)
2	8851	9855	1714	1004(వైసిపి)
3	9277	9353	1980	76(వైసిపి)
4	9194	9216	2043	22(వైసిపి)
5	8988	8999	2373	11(వైసిపి)
6	8980	9023	2297	43 (వైసిపి)
7	9663	9026	1683	637(టిడిపి)
8	9475	9542	1326	67(వైసిపి)

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ విజేత ఎంవి.రామచంద్రా రెడ్డి

పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ నియోజక వర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి మద్దతుతో పోటీ చేసిన ఎంవి.రామచంద్రారెడ్డి విజయం సాధించారు. శుక్రవారం నాడు జెఎన్‌టియులో ఏర్పాటు చేసిన మీడియా ప్రాంగణం వద్ద కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆయనకు ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందజేశారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ నియోజక వర్గానికి జరిగిన ఎన్నికల్లో 25,879 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 608 ఓట్లు చెల్లని ఓట్లుపోగా 25,271 ఓట్లను వాలిడ్‌గా గుర్తించారు. రెండు రౌండ్లలో జరిగిన ఈ ఓట్ల లెక్కింపులో మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సరికి వైసిపి మద్దతుదారుడు ఎంవి.రామచంద్రారెడ్డికి 8846 ఓట్లు, ఎపిటిఎఫ్ మద్దతుదారుడిగానున్న ఒంటేరు శ్రీనివాసరెడ్డికి 6853 ఓట్లు, పిడిఎఫ్ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి 4162 ఓట్లు , స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగిన డాక్టర్ అనిల్ వెంకట ప్రసాద్‌రెడ్డికి 3212, జీవినారాయణరెడ్డికి 1345 ఓట్లు వచ్చాయి. తక్కిన వారికి నామ మాత్రపు ఓట్లే వచ్చాయి.

మొత్తం పోలైన ఓట్లలో ఎవరికి 50 శాతం దాటకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. తక్కువ ఓట్లు వచ్చిన వారి నుంచి ఎలిమినేషన్ ప్రారంభించారు. ఆఖరి ఎలిమినేషన్ జరిగిన పిడిఎఫ్ అభ్యర్థి ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సమయానికి 3867 ఓట్లు ప్రాధాన్యత బదిలీ అనంతరం కోల్పోయి ఓట్లు ఉన్నాయి. తక్కిన ఓట్లలో ఎంవి.రామచంద్రారెడ్డికి 10,787 ఓట్లు రాగా, శ్రీనివాసరెడ్డికి 10618 ఓట్లు వచ్చాయి. ఇద్దరిలోనూ ఎవరికి 50 శాతానికిపైగా ఓట్లు రానప్పటికీ ఎలిమినేషన్ పూర్తయ్యే సమయానికి అత్యధిక ఓట్లు కలిగిన ఎంవి.రామచంద్రారెడ్డిని విజేతగా ప్రకటించారు. 169 ఓట్ల స్వల్ప మెజార్టీతో ఆయన బయటపడ్డారు.



ఎంవి.రామచంద్రారెడ్డి



డిక్లరేషన్ పత్రాన్ని అందుకుంటున్న ఎంవి.రామచంద్రారెడ్డి



ఘటనా స్థలంలోనే మృతి చెందిన నలుగురు వ్యక్తులు

బత్తలపల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం

బొలేరో, ఆటో ఢీ.. ఆరుగురు దుర్మరణం మరో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్, బత్తలపల్లి

వివిధ పనుల నిమిత్తం వెళ్లి తిరిగి వారివారి స్వగ్రామాలకు మరో 15 నిమిషాల్లో చేరుకోవాల్సిన సమయంలో ఘోరరోడ్డు ప్రమాదం రూపంలో మత్యువు కబళించింది. ఓ ఆటో బొలెరో వాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు మత్యువాత పడిన సంఘటన శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం పోట్లమర్రి సమీపంలో శుక్రవారంరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రమైన బత్తలపల్లి నుంచి 10 మంది ప్రయాణికులతో ఆటో ధర్మవరంకు బయలుదేరింది. ఆటో ఫోట్లమర్రి సమీపంలోకి రాగానే ధర్మవరం నుంచి బత్తలపల్లికి వైపునకు వెళ్తున్న బొలెరో వాహనాన్ని వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘోరప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్ తోపాటు మరో ముగ్గురు అక్కడికక్కడే మతిచెందారు. మరోకరు బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రిలో మతిచెందారు. మతిచెందిన వారిలో ధర్మవరానికి చెందిన ఆటో డ్రైవర్ నరసింహులు(25), గొట్లూరుకు చెందిన ఈశ్వరయ్య(35), ముదిగుబ్బ మండలం నల్లాయకుంటపల్లికి చెందిన గాలి నారాయణస్వామి(48), పోట్లమర్రికి చెందిన మల్లేశ్(35) అక్కడికక్కడే మతిచెందగా ధర్మవరంలోని కొత్తపేటకు చెందిన హాజీపీరా(54), మరో గుర్తుతెలియని వ్యక్తి(51) ఆర్డీటీ ఆస్పత్రిలో మతిచెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అందులో బొలెరో వాహనం డ్రైవర్ కుమార నరసింహులతోపాటు ఆటోలో ప్రయాణిస్తున్న రంగస్వామి, ఆరేళ్ల చిన్నారి, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను వైద్య చికిత్సల కోసం బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ధర్మవరం రూరల్ సీఐ మన్సూరుద్దీన్ సంఘటనాస్థలానికి చేరుకుని జరిగిన ప్రమాచాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. మతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

బత్తలపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. బత్తలపల్లి నుంచి ధర్మవరం వైపు వెళ్తున్న బొలేరో, ఆటోలు ఢీకొని ఏడుగురు మృత్యువాత పడటం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవడంతోపాటు గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రమాద సమయంలో సహాయ చర్యలు చేపట్టిన స్థానికులకు సిపిఎం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

అకాల వర్షం..పంట నష్టం..!

బొమ్మనహాల్‌లో తడిసిన మిరప

ప్రజాశక్తి-బొమ్మనహల్

అకాల వర్షం.. పంటలకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. శుక్రవారం మధ్యాహ్నం బొమ్మనహాల్‌లో కురిసిన వర్షాలకు పలు గ్రామాల్లో పంటలు నీటిలో తడిసాయి. మండల పరిధిలోని గోవిందవాడ, దర్గా హొన్నూరు, బొల్లన్నగుడ్డం, కళ్లహాల, దేవనహళ్లి, కష్టాపురం, ఎల్బీనగర్, కురువల్లి, చంద్రగిరి, దేవగిరి, ఉద్దేహాళ్, లింగదహాల్ గ్రామాల్లో మిరప పంట తడిసిపోయింది. పంట ఆరబెట్టుకున్న సమయంలో వర్షం రావడంతో నీటిలో తడిసిపోయింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మిరప కోసి పొలాల్లో ఆరబోసుకున్న సమయంలో వర్షం రావడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏడు నెలల పాటు సాగు చేసి కోత కోసిన పంట గంట వర్షంతో తుడిచిపెట్టుకుని పోయిందన్నారు. మండలంలో పంటలు ఆరబోసుకునేందుకు గోడౌన్లు లేక రైతులు పొలాల్లోనే ఎండబెట్టుకుంటున్నారు. దీంతో ఇలా వర్షం వచ్చిన ప్రతి సారి పంట మొత్తం తడిసిపోతోంది.

పూర్తిగా నష్టపోయాం


కురుబ సుంకన్న, వన్నూరప్ప,గోవిందవాడ గ్రామం.

పంట చేతికొచ్చిన సమయంలో వర్షం తీవ్రంగా ముంచేసింది. కౌలు, ఇతర పంట సాగు కోసం రూ.2 లక్షల వరకు ఖర్చు చేశాం. పంట చేతికొచ్చిన సమయంలో ఇలా వర్షంతో తడిసి పూర్తిగా నష్టపోయాం. తడిచిపోయిన మిరప రంగు మారితే కొనేందుకు వ్యాపారులు ఎవరూ ముందుకురారు. ప్రభుత్వం స్పందించి బాధిత రైతులు అందరికి పూర్తి స్థాయిలో పంట నష్టపరిహారం చెల్లించాలి.

రాష్ట్రస్థాయి జూనియర్ హాకీజట్టుకు క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రాష్ట్రస్థాయి జూనియర్ హాజీ జట్టుకు క్రీడాకారులు ఎంపికైనట్టు ధర్మాంబ హాకీ అసోసియేషన్ ప్రతినిధులు బంధనాథం సూర్యప్రకాష్, బీవీ శ్రీనివాసులు తెలిపారు. ఈమేరకు రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైన క్రీడాకారులను శుక్రవారం స్థానిక హామీ అసోసియేషన్ కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రం రామనంతపురంలో ఈనెల 17 నుంచి 26వ తేదీ వరకు జాతీయస్థాయి హాకీ పోటీల్లో సత్యసాయి జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులు అఖిల, పావని, ఈశ్వర్ రాష్ట్రం తరుపున పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పల్లెం వేణుగోపాల్, బండి వేణుగోపాల్, ఉడుముల రాము, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి జూనియర్ హాకీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిదులు

ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోండి

కమిషనర్ మల్లికార్జున

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్



పట్టణంలో ఆస్తి, ఖాళీ స్థలాలకు సంబంధించిన పన్నులపై వడ్డీ మాఫీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సి3పల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఆస్తి, ఖాళీస్థలాలకు సంబంధించి ఇప్పటి వరకు బకాయిలను ఈనెల 31వతేదీలోగా చెల్లిస్తే వడ్డీ మాఫీ చేయాలని జీవో 34ను విడుదల చేసినట్లు తెలిపారు. ఈనేపథ్యంలో పట్టణంలో చాలామంది కొన్ని సంవత్సరాలుగా పన్నుల బకాయిలు చెల్లించలేదన్నారు. ఇలాంటి వారికి ఈ జీఓ సువర్ణావకాశం అన్నారు. పట్టణంలో 64 ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి దీర్ఘకాలిక బకాయిలు మొత్తం రూ.3.87 కోట్లు ఉండగా వడ్డీ మాఫీ కింద రూ.2.47 కోట్లు పోను రూ.1.40 కోట్లు కట్టాల్సి ఉందన్నారు. అలాగే ప్రయివేటు ప్రాపర్టీస్ 13,385 మందికి రూ.1.69 లక్షలు వర్తించే వడ్డీ మాఫీ వర్తిస్తుందన్నారు. నీటి పన్నులు కూడా ఏడేళ్లగా రూ.5.55 కోట్లు రావాల్సి ఉందన్నారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లిస్తే వార్డుల్లో సీసీరోడ్లు, వీధిలైట్లు తదితర మౌలిక సౌకర్యాలు కల్పించడానికి వీలు ఉంటుందన్నారు. అదేవిధంగా కళాజ్యోతి సర్కిల్‌లో మున్సిపల్ కాంప్లెక్స్ దెబ్బతినడం వల్ల దానిని పూర్తిగా తొలగించి గుడ్‌విల్ పద్ధతిన నూతన కాంప్లెక్స్‌ను నిర్మించడానికి రూ.1.50 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈనెల 20వ తేదీ సోమవారం కళాజ్యోతిసర్కిల్‌లో నూతన కాంప్లెక్స్ నిర్మాణానికి బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు రూ.1.50 డిపాజిట్‌తోపాటు వేలం రోజు గంటకు ముందే నగదు చెల్లించవచ్చన్నారు. అదేవిధంగా రూ.2.50 లక్ష సాల్వేన్సీ సర్టిఫికెట్ తప్పని సరిగా ఆందజేయాలన్నారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో 7 గదులు, 1వ అంతస్తులో 8 గదులు నిర్మించనున్నట్లు తెలిపారు. ఒక్కో గదికి రూ.102115 గుడ్‌విల్‌గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఒ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలోకి లోకేష్ పాదయాత్ర

తనకల్లు మండలం చీకటిమానిపల్లి వద్ద ఘనస్వాగతం

కందికుంట ఆధ్వర్యంలో భారీగా తరలిన టిడిపి శ్రేణులు-నేటి నుంచి జిల్లాలో పాదయాత్ర

ప్రజాశక్తి-కదిరి టౌన్/తనకల్లు

టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర శ్రీ సత్యసాయి జిల్లాలోకి ప్రవేశించింది. అన్నమయ్య జిల్లా నుంచి శుక్రవారం సాయంత్రం తనకల్లు మండలం చీకటిమానినపల్లి వద్ద యాత్ర జిల్లాకు చేరుకుంది. దీంతో కదిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో దాదాపు 300 వాహనాల్లో కార్యకర్తలు వచ్చి ఘన స్వాగతం పలికారు. మాజీ మంత్రులు పరిటాల సునీత, కొల్లు రవీంద్ర, కదిరి, ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జులు కందికుంట వెంకటప్రసాద్, పరిటాల శ్రీరామ్, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిప్పేస్వామి, అంబిక లక్ష్మినారాయణ, తెలుగు యువత ఎస్.బాబ్జాన్, ఎల్.నారాయణచౌదరి, ఎంఎస్.రాజు తదితరులు స్వాగతం పలికారు. పాదయాత్ర జిల్లాకు చేరుకున్న అనంతరం చీకటిమానిపల్లి వద్ద గల విడిది కేంద్రానికి లోకేష్ చేరుకున్నారు. శనివారం ఉదయం 8:30గం॥కు పాదయాత్ర ప్రారంభం కానుంది. గ్రామ సమీపంలోని గంగసానిపల్లి వద్ద టమోటా రైతులతో లోకేష్ ముఖాముఖి నిర్వహిస్తారు. బిసినవారిపల్లి వద్ద బలిజ కులస్తులతో సమావేశంలో పాల్గొంటారు. కొక్కంటి క్రాస్‌కు చేరుకుని ఎస్టీలతో సమావేశం నిర్వహించనున్నారు. మండ్లిపల్లి వద్ద స్వాగత కార్యక్రమం తర్వాత తనకల్లు మండల కేంద్రంలో ఎస్సీలతో ముఖాముఖి ఉంటుంది. అక్కడి నుంచి నల్లచెరువు మండల పరిధిలోని చిన్న పల్లోల్లపల్లికి పాదయాత్ర చేరుకుంటుంది. రాత్రి విడిది కేంద్రం వద్ద మొదటి రోజు పాదయాత్ర ముగియనుంది. లోకేష్ పాదయాత్ర విజయవంతం అయ్యేందుకు ఇప్పటికే టిడిపి నాయకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



జిల్లాలోకి ప్రవేశించిన అనంతరం ప్రజలకు అభివాదం చేస్తున్న టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేస్



పాదయాత్రలో లోకేష్‌తో కలిసి నడుస్తున్న మాజీమంత్రి పరిటాల సునీత, కదిరి, ధర్మవరం నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలు కందికుంట వెంకటప్రసాద్, పరిటాల శ్రీరామ్

చలో విజయవాడను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి-హిందూపురం

అంగన్ వాడీ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్న డిమాండ్‌తో ఈ నెల 20న చేపట్టిన చలో విజయవాడను జయప్రదం చేయాలని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప కోరారు. ఈ విషయంపై శుక్రవారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అధికారికి అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ కార్యదర్శి లావణ్య, కోశాధికారి శిరీష, యూనియన్ నాయకులు పద్మావతమ్మ, సుమియా తదితరులు పాల్గొన్నారు.



ఐసిడిఎస్ అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

శరవేగంగా కార్మిక, కర్షక భవన నిర్మాణ పనులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సమీపంలో సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన కార్మిక కర్షక భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, పెనుగొండ రమేష్, సిఐటియు బాబావలి తదితరులు భవన నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. బేలూరెడ్డి నాగమ్మ పేరుతో నిర్మిస్తున్న ఈ భవనానికి ఎంతోమంది కమ్యూనిస్టు భావజాలం కలిగిన వ్యక్తులు మానవతావాదులు సహాయ సహకారాలు అందిస్తున్నారని వారు తెలిపారు. ఇది కేవలం ఉద్యోగ కార్మిక కర్షకులకే కాకుండా పేద ప్రజలకు కూడా ఉపాధి కల్పించే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ భవన నిర్మాణ పనులు ఇప్పుడే ప్రారంభమైందని ఇందుకోసం ప్రతి ఒక్కరూ చేయూత అందించాలని వారు కోరారు. పార్టీ అభిమానులు, కార్మికులు రైతులు సహకరించి పనులు త్వరితగతిన పూర్తి అయ్యేందుకు కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.



భవన నిర్మాణ పనుల్లో సిపిఎం నాయకులు

రోడ్డు ప్రమాదంలో జింక మృతి

రొద్దం : మండలంలోని పాతర్లపల్లి సమీపంలో రోడ్డు ప్రమాదంలో జింక మృతిచెందింది. మండల కేంద్రానికి చెందిన ఫక్రుద్దీన్ గుట్టూరు ప్రభుత్వ ఆసుపత్రిలో కాంపౌండర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. విధులు ముగించుకుని ద్విచక్రవాహనంలో తిరుగు ప్రయాణ మయ్యారు. మండలంలోని పెనుగొండ పావగడ ప్రధాన రహదారిలో పాతర్లపల్లి సమీపంలో ఫారం కోళ్ల షెడ్ సమీపానికి రాగానే జింక అడ్డు రావడంతో జింకను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో జింక అక్కడికక్కడే మృతి చెందింది. ఫక్రుద్దీన్ తీవ్రంగా గాయపడ్డాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరుకు తరలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న జమేదార్ నాగరాజు, పోలీసులు శివ కుమార్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతి చెందిన జింకను పెనుగొండ ఫారెస్ట్ అధికారులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

దాడి అమానుషం

కదిరి టౌన్ : కాకినాడ లో విధి నిర్వహణలో ఉన్న వాహన తనిఖీ అధికారి పై దాడి అమానుషమని కదిరి మోటార్ వాహనాల తనిఖీ అధికారి వరప్రసాద్ అన్నారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విధి నిర్వహణలో భాగంగా వాహనాలను తనిఖీ చేస్తుండగా అధికారిపై వాహన దారుడు అమానుషంగా దాడి చేయడం అమానుషమన్నారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన అధికారి చావు బతుకుల మధ్య ఉన్నాడన్నారు. ఈ దాడిని ఖండిస్తూ వాహనాల తనిఖీ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా నల్ల బ్యాడ్జిలు తగిలించుకొని నిరసన తెలిపారన్నారు.

డీలర్ల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన

పుట్టపర్తి రూరల్: శ్రీ సత్యసాయి జిల్లా రేషన్ డీలర్ల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలు తప్పవని జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎద్దుల రంగారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం శిల్పారామంలో ఏర్పాటుచేసిన జిల్లా డీలర్ల సమావేశానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ పరంధామ రెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సుంకప్ప, జిల్లా కోశాధికారి చిదానంద రెడ్డి, ఉపాధ్యక్షులు రంగారెడ్డి, లేపాక్షి మండల అధ్యక్షురాలు గంగ రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. మొదటి కరోనా సమయం నుండి డీలర్లకు రావలసిన కమిషన్ వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. స్థానిక స్టాక్ పాయింట్లు కేర్ వెయిట్, గన్ని సంచుల బకాయిలు, గతంలో జరిగిన విజయవాడ సమావేశంలో జరిగిన విషయాల గురించి మాట్లాడారు. ఈ సమావేశంలో పుట్టపర్తి మండల అధ్యక్షులు మురళీకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి చిన్న తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

లేపాక్షి : మండలం పరిధిలోని గలిబిపల్లి గ్రామం లో అనారోగ్యం తో మృతిచెందిన నాగరాజు కుటుంబానికి వైఎస్ఆర్ బీమా పథకంలో భాగంగా తక్షణసాయం కింద రూ. 10వేలను అందజేశారు. నామిని అయిన శ్రీనివాసులుకు లేపాక్షి సర్పంచి ఆదినారాయణ చేతులు మీదుగా రూ.10వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ మంజుల, సచివాలయం కన్వీనర్ అంజినప్ప , ఆంజనరెడ్డి పాల్గొన్నారు.

యువత సేవా కార్యక్రమాలు చేపట్టాలి

ఓబులదేవరచెరువు : ప్రస్తుత సమాజంలో యువత సేవా కార్యక్రమాలు చేపట్టి ఆదర్శంగా ఉండాలని ఎస్ఐ కె.గోపీ పిలుపునిచ్చారు. శుక్రవారం కొండకమర్ల పంచాయతీ గ్రామ ఆటో స్టాండ్ వద్ద యువకుడు అబ్బు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్ఐ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, రమేష్ నాయక్,బాబ్జాన్, శింగనమల బాబు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రా రెడ్డి విజయం పట్ల హర్షం

పుట్టపర్తి అర్బన్ : పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గా ఎంవి రామచంద్ర రెడ్డి విజయం సాధించడం పట్ల వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలో మిఠాయిలు పంచుకుని సంతోషం వ్యక్తం చేశారు. రామచంద్ర రెడ్డి ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తెచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, పివి. రమణారెడ్డి, భాస్కర్ రెడ్డి, పుల్లయ్య, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్న గృహ నిర్మాణాల పరిశీలన

అమడగూరు : మండల పరిధిలోని చిన్నగానిపల్లి పంచాయతీ గ్రామాలలో చేపట్టిన జగనన్న గృహ నిర్మాణ పనులను హౌసింగ్ డిఇ నాగరాజు పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. వెంటనే లబ్ధిదారులకు సిమెంట్ పంపిణీ చేసి బిల్లులు పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ భాను ప్రకాష్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాజేశ్వరి, వర్క్ ఇన్స్పెక్టర్ మంజునాథ్, వైసిపి మాజీ కన్వీనర్ శేషు రెడ్డి, ఎంపీపీ రామచంద్ర, రవి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పన్నులపై వడ్డీ మాఫీ


హిందూపురం : పురపాలక సంఘ వ్యాప్తంగా బకాయిలున్న ఆస్తి, ఖాళీ జాగా పన్నులపై వడ్డీ మాఫీని బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 31వ తేదీ లోపు చెల్లించిన వారికి వడ్డీ మాఫీ వర్తిస్తుందన్నారు. పన్నుల వసూళ్ల కోసం ప్రజల సౌకర్యార్థం పురపాలక సంఘ వ్యాప్తంగా ఆరు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. నేరుగా వచ్చి చెల్లించని వారు సిడిఎంఎ అప్లికేషన్ ద్వారా చెల్లించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు.

లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయండి

పుట్టపర్తి రూరల్ : ఈనెల 21న పుట్టపర్తి నియోజకవర్గంలోకి ప్రవేశిస్తున్న లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ పుట్టపర్తి నియోజకవర్గ నాయకులు కోరారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ పిసి గంగన్న అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో బుక్కపట్నం మాజీ ఎంపీపీ పెద్దరాసు సుబ్రహ్మణ్యం, మాజీ ఏజీపీ అమ్మినేని క్రిష్టప్ప, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ అల్లా బకాష్ ,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రఘుపతి, వాల్మీకి సంఘం జిల్లా అధికార ప్రతినిధి లోచర్ల పెద్దన్న, కొత్తచెరువు టౌన్ కన్వీనర్ జెసిబి శ్రీనాథ్, మాజీ ఎంపీటీసీ చింత మానిపల్లి లక్ష్మీపతి నాయుడు, శ్రీనివాస్ నాయుడు, అగ్రహారం వారాది, లక్ష్మీనారాయణ, పుట్లపోతన్న మాజీ డీలర్ సూరి తదితరులు పాల్గొన్నారు. లోకేష్ పాదయాత్రకు స్వాగతం పలికేందుకు జన సమీకరణపై చర్చించారు.

కదిరి అర్బన్ : నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర తనకల్లు మండలంలో చీకటిమాని వారి పల్లి సమీపాన శుక్రవారం జిల్లాలో అడుగుపెడుతున్న సందర్భంగా స్వాగతం పలకడానికి మాజీ ఎమ్మెల్యే అత్తర్ చాంద్ బాషా వాహనాలతో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రతో అధికార పార్టీ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు.

పుట్టపర్తి అర్బన్ : సత్యసాయి జిల్లాలో నారా లోకేష్ నిర్వహించే పాదయాత్రకు సంబంధించిన పోస్టర్లను టిడిపి నాయకులు శుక్రవారం విడుదల చేశారు. పట్టణంలోని హనుమాన్ సర్కిల్‌లో టిడిపి కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను యువగళం పేరుతో లోకేష్ ప్రజల్లోకి తీసుకెళుతున్నారన్నారు. ఈనెల 21న పుట్టపర్తి నియోజకవర్గంలోకి పాదయాత్ర ప్రవేశిస్తుందని చెప్పారు. నియోజకవర్గంలో పాదయాత్రకు సంఘీభావంగా వేల సంఖ్యలో మద్దతు ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రైతు అధికార జిల్లా ప్రతినిధి కేశవ నాయుడు, నియోజకవర్గం ఐటిడిపి అధ్యక్షులు కొత్తపల్లి జయప్రకాష్, నాయకులు రాజశేఖర్ యాదవ్, వెంకటరాముడు, చంద్రశేఖర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రలో పాల్గొన్న కదిరి నాయకులు

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు



పరీక్షల నిర్వహణ తీరును పరిశీలిస్తున్న కలెక్టర్

పెనుకొండ : ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పి.బసంత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీసత్య సాయి జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 99 కేంద్రాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్ పరీక్షల మొదటి సంవత్సరం విద్యార్థులకు ఆంగ్ల పరీక్ష నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో, డిఐవిఇఒ రఘునాథరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ బషీర్, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : ప్రభుత్వ, శివ సాయి జూనియర్ కళాశాలల్లో శుక్రవారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం ఆంగ్ల పేపర్ పరీక్షలకు 37 మంది గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ చంద్రమౌళి తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో 381 మందికి గాను 258 మంది, శ్రీ శివ సాయి కళాశాలలో 322 మంది విద్యార్థులకు గాను 308 మంది హాజరయ్యారని చెప్పారు.

మడకశిర : మడకశిర పట్టణంలో ఇంటర్ పరీక్షలు జరుగుతున్న మూడు కేంద్రాలను హై పవర్ కమిటీ స్క్వాడ్ బృందం సభ్యులు రమణ కుమార్, షఫీ తనిఖీ చేశారు. మడకశిర పట్టణంలోని జూనియర్ కళాశాల, వృత్తి విద్య కళాశాల, వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో శుక్రవారం రోజు ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ పరీక్ష నిర్వహించారు. హైపవర్ కమిటీ స్క్వాడ్ సభ్యులు ఈ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

రొద్దం : మండలంలోనిజూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ మొదటి సంవత్సరం రెండవ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 109 మంది విద్యార్థులకు గాను 107మంది హాజరయ్యారని ప్రిన్సిపల్ విజయలక్ష్మి తెలిపారు.

మున్సిపాల్టీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు



కలెక్టరేట్ ముందు ఆందోళన చేస్తున్న కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య, ఇంజనీరింగ్, క్యాప్ డ్రైవర్ల అండర్ డ్రైనేజీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని సిఐటియు, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు హెచ్చరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన కార్మికులు శుక్రవారం పుట్టపర్తి ఆర్టీసీ డిపో నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీగా చేరుకున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ గేట్ ముందు బైటాయించి నినాదాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్, మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న కార్మికులకు ఉద్యోగ భద్రత లేదన్నారు. కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పెండింగ్ లో ఉన్న మూడు నెలల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న ఐదు నెలల పిఎఫ్ చెల్లించాలని, ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్ అలవెన్స్ లు, రిస్క్ అలవెన్స్ లు ఇవ్వాలని కోరారు. పేస్ యాప్ విధానాన్ని రద్దు చేయాలని, మృతి చెందిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. అనంతరం జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, మండల కార్యదర్శి గౌస్ లాజాం, కార్మిక సంఘం నాయకులు గోవిందు, పెద్దన్న, రామయ్య, నరసింహులు, నాగార్జున, గంగాధర్ పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

పెనుకొండ : మండలంలోని మావటూరు గ్రామ సచివాలయాన్నిపెనుకొండ సబ్ కలెక్టర్ కె.కార్తీక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న అన్ని పథకాలు ప్రజలకు చేరేవిధంగా చూడాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. సచివాలయంలో పలు రిజిస్టర్లను తనిఖీ చేశారు.



హాజరుపట్టికు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

మడకశిర రూరల్ : ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను త్వరగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ కారిక్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మండల పరిధిలోని ఆర్ అనంతపురం గ్రామ సచివాలయాన్ని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. హాజరుపట్టికను పరిశీలించి సచివాలయ ఉద్యోగుల పనితీరుపై ఆరా తీశారు. సమయపాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అనాథ మృతదేహం

హిందూపురం : పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన, ప్రభుత్వ అసుపత్రి గేటు వద్ద ఓ అనాథ వృద్ధుడు పడి ఉన్నాడు. అటుగా వెళుతున్న సల్తానత్ ఏ ఖుదాదాద్ ఫౌండేషన్ అధ్యక్షులు అతిఖ్ ఉర్ రెహమాన్ గుర్తించి వన్‌టౌన్ సిఐ ఈరన్నకు సమాచారం అందించారు. ఆయన వెంటనే ఎఎస్ఐను అక్కడి పంపారు. వృద్ధుడిని పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మూడు రోజులుగా ఆనారోగ్యంతో భాదపడుతున్న వృద్ధుడు ఆసుపత్రి ముందు మృతిచెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని ఫౌండేషన్ సభ్యులు ఆసిఫ్, అర్బాజ్, ఫైజాన్, అజ్మత్,, అల్లుకుమార్ సాయంతో పోలీసులు పోస్టుమార్టం గదికి తరలించారు.

రిటైర్డ్ ఉద్యోగిని మృతికి సంతాపం

కదిరి టౌన్ : ఉద్యోగి తన సర్వీసులో చేసిన ఉత్తమ సేవలు అందరికి గుర్తుండి పోతాయని, అలాంటి ఉత్తమ సేవలు చేసిన జాసన్ కుమార్ అందరి హృదయాలలో నిలిచిపోయాడని వక్తలు కొనియాడారు. అనారోగ్యంతో మంగళవారం మృతిచెందిన ఆర్టీసీ మాజీ అసిస్టెంట్ మేనేజరు జాసన్ కుమార్‌కు ఆఫీసు సిబ్బంది శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ జాసన్‌కుమార్ రిటైర్డు అయిన తరువాత కూడా సమాజసేవలో రాణించాడన్నారు. సర్వీసులో వున్నప్పుడు ఉద్యోగిగా అందరి ప్రశంసలు అందుకున్నారని చెప్పారు. అతను పనిచేసిన పులివెందుల,హిందూపురం,అనంతపురము డిపో లలో కూడ ఇప్పటికి జాసన్ సేవలు గుర్తుంచుకుంటున్నారని అసిస్టెంట్ మేనేజరు హరిమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆఫీసు సిబ్బంది శ్రీనివాసులు,అబ్బాస్, బాబు, సుబ్బారెడ్డి, లక్ష్మీపతి, రూత్ హెలెన్, బస్టాండు కంట్రోలర్లు ఉత్తన్న, రామచంద్ర, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సామాజిక సేవా కార్యకర్తలతో ఎడిజె శైలజ

సామాజిక సమస్యలపై బాధ్యతగా వ్యవహరించాలి

ప్రజాశక్తి-హిందూపురం

సామాజిక సేవా కార్యకర్తలు సామాజిక సమస్యలపై బాధ్యతగా వ్యవహరించాలని అదనపు జిల్లా న్యాయమూర్తి శైలజ సామాజిక కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం స్థానిక అదనపు న్యాయ స్థానంలో అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో సామాజిక బాధ్యతపై సామాజిక సేవా సంఘాలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా న్యాయమూర్తి శైలజ మాట్లాడుతు హిందుపురం పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, మహిళలు, పసిపిల్లలపై జరుగుతున్న అత్యాచార దాడులను సామాజిక సేవకులు సమాజంలో చైతన్య పరిచి ఆపడానికి ప్రయత్నం చేయాలన్నారు. న్యాయ సేవా సంస్థలు సహాయ సహకారాలు అందించటానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నగారా, టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు ఉమర్ ఫారూక్ ఖాన్, వృక్షరక్షకుడు భాస్కర్ రెడ్డి, వృద్ధాశ్రమం నాగిరెడ్డి, చేనేత సామాజిక సేవకులు ఎసి. నాగరాజు, యునైటెడ్ సిఖ్ మోహిందర్ జీత్ సింగ్, పల్వీందర్ సింగ్, మౌలానా షాబుద్దీన్, అన్సార్ మజీద్ ముతవల్లీ ఖలీల్, సెల్ పాయింట్ నూరుల్లా, న్యాయవాదులు కళావతి, నవీరా, లోక్ అదాలాత్ శారద, హేమావతి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ రెండవ సెమిస్టర్‌లో 'శ్రీసత్యసాయి' విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి -పెనుకొండ

గత సంవత్సరం అక్టోబర్ నెలలో నిర్వహించిన డిగ్రి రెండవ సెమిస్టర్ పరీక్షల ఫలితాల్లో పట్టణంలోని శ్రీసత్య సాయి డిగ్రి కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ కళాశాల ప్రిన్సిపల్ కె.అశోక్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఫలితాలలో 64శాతం ఉత్తీర్ణత సాధించిన కళాశాల విద్యార్థులు విజయ దుందభి మోగించారన్నారు. బిఎస్సీ, ఎంపిసిఎస్, ఫిజిక్స్ విభాగంలో కె. అనిత 8.28, పూజిత 8.20, బిజెడ్‌సిలో అనిత 8.20, పావని 7.7, మేనేజ్‌మెంట్ బిబిఎ విభాగంలో జోహ్రా ఫాతిమా 8.51, నవాజుద్దీన్ 8.28 పాయింట్లు సాధించారన్నారు. బికాం సిఎలో సి.ముఖేష్ 7.9, కె. మల్లేశ్వరి 7.5 పాయింట్లు సాధించారన్నారు., అంతేకాకుండా 20 మంది డిస్టెంక్షన్, 25శాతం కంటే ఎక్కువ మొదటి శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారని చెప్పారుఅనంతరం విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కళాశాల ఏవో కేశవయ్య, అధ్యాపకులు వినోద్, వీణ, సంధ్య, జాహీర్, నవీన్, అనిల్, విద్యార్థులు పాల్గొన్నారు.



విజయచిహ్నం చూపుతున్న విద్యార్థులు



రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీస్తున్న అధికారులు

జిల్లా ఆసుపత్రి తనిఖీ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం జిల్లా ప్రభుత్వ అసుపత్రిని అమరావతికి చెందిన జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవా సాగర్, డాక్టర్ సుబ్బరెడ్డితో కూడిన కాయకల్ప బృందం శుక్రవారం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు అసుపత్రిలోని మాత శిశు విభాగంలో ఉన్నా గర్భిణుల వార్డును తనఖీ చేసి అక్కడ వారికి అందుతున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. చిన్న పిల్లల వార్డును తనిఖీ చేసి వార్డులో సౌకర్యాలను మెరుగుపర్చుకోవాలని హెడ్ నర్సులకు సూచించారు. ఎన్‌బిఎస్‌యు వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారులను పరిశీలించారు. నిత్యం అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు ఆఫ్తాబ్, శ్రీకాంతి, కీర్తిని అభినందించారు. అసుపత్రిలో ఇతర సౌకర్యాలపై వైద్యులు వెంకటరమణ నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. పిపి యూనిట్ వైద్యులు ఆనంద్‌బాబు, పద్మజకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రాజగోపాల్, ఇతర వైద్యులు, హెడ్‌నర్సులు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి తోడ్పడని రాష్ట్ర బడ్జెట్ : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2023-24 వార్షిక బడ్జెట్‌లో విద్యారంగ అభివృద్ధికి ఏమాత్రం తోడ్పాటు అందించలేదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి విమర్శించారు. బడ్జెట్‌పై ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి మాట్లాడుతూ రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధుల కేటాయింపులు చేశారన్నారు. అంకెల్లో ఎక్కువగా కనిపిస్తున్న గత సంవత్సరానితో పోలిస్తే ఈ ఏడాది 0.2 శాతం కేటాయింపులు తగ్గాయన్నారు. అనేక నివేదికలు రాష్ట్ర బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించాలంటుంటే మన రాష్ట్ర బడ్జెట్ లో మాత్రం 10.6శాతం కన్నా మించడం లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పెరిగారని గొప్పలు చెప్పుకుంటున్న చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం గతంలో అమ్మఒడికి కేటాయించిన నిధుల్లో ఈ సంవత్సరం తగ్గిందని అన్నారు. డిజిటల్ తరగతి గదుల ఏర్పాటును ఈ బడ్జెట్‌లో మరిచిపోయారన్నారు. ఉన్నత విద్యారంగానికి గతం కన్నా 0.5 శాతం నిధులను తగ్గించారన్నారు. ఈ బడ్జెట్‌ను చూస్తుంటే విద్యారంగానికి కంటితుడుపుగాఉందన్నారు.

'అవినీతికి కేరాఫ్ అటవీశాఖ'

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

సత్యసాయి జిల్లాలో అవినీతి అక్రమాలకు అటవీశాఖ అధికారులు కేరాఫ్‌గా మారారని వారిపై తగిన చర్యలు తీసుకోవాలని రాయలసీమ ఐక్య విద్యార్థి ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆసంఘం నాయకులు పిక్కిలి మహేష్, నరసింహారావు శుక్రవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామగిరి రేంజ్ పరిధిలో కనగానిపల్లి మండలం కుర్లపల్లి, చంద్రచర్ల తదితర గ్రామాల గొర్రెల కాపరులతో ప్రతినెల 3వేల రూపాయల నుంచి రూ. 5వేల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇవ్వకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని బెదిరిస్తున్నారని విమర్శించారు. కుర్లపల్లి వరదయ్య స్వామి కొండ అటవీ ప్రాంతంలో వేలాది ఎకరాలలో ఉన్న అడవికి నిప్పు పెడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఫలితంగా అటవీ సంపద, వన్యప్రాణులు అగ్నికి ఆహుతి అవుతున్నాయన్నారు. బొగ్గు మాఫియా అడవికి అగ్గిపెట్టి చెలరేగుతున్నప్పటికీ మామూళ్లకు కక్కుర్తి పడిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వీరి తీరుపై ఉన్నత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిఐ నాయకుడు కురుగుంట గోవిందు తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో రైతుల్లో ఆందోళన

మడకశిర : మడకశిర ప్రాంతంలో గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురవడంతో చింత రైతులు ఆందోళనకు గురయ్యారు. ఈదురుగాలులకు అటు చింత రైతులే కాకుండా మామిడి తోటల్లో పలుచోట్ల మామిడి పింద నేలరాలి పోయింది. దీంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. గురువారం రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. దాదాపు అరగంట పాటు వర్షం ఏకదాటిగా కురిసింది. మరోసారి తెల్లవారుజామున వర్షం కురిసింది. దీంతో చింత, అరటి, మామిడితోటల రైతులు ఆందోళన చెందుతున్నారు. చింత చెట్లలో ఉన్న చింతకాయలు దిగుబడికి వచ్చే సమయంలో ఇలాంటి వర్షం కురవడం వల్ల చింతకాయ మొత్తం రంగు మారిపోతుందని వాపోయారు. కొన్ని గ్రామాలలో చింతపండును కాయ నుండి వేరు చేయడానికి ఇళ్ల వద్ద, కల్లాల్లో రాసిపోసుకుని ఉండగా పండు తడిసిపోయింది. మామిడి తోటల్లో పిందె రాలిపోవడంతో పంట దిగుబడి లేక నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. అరటి చెట్లు సైతం ఈదురు గాలులకు నెలకొరిగాయి. అంతేకాక ఇటుక బట్టీల యజమానులకు సైతం ఈ అకాల వర్షాలు నష్టాన్ని చేకూర్చాయి. ఇదిలా ఉండగా పలు గ్రామపంచాయతీలలో చెరువులను ఇటీవల వేలం నిర్వహించడంతో చేపల పెంపకం దారులు వేలంపాట దక్కించుకొని చేప పిల్లలను వదలడంతో అవి సైతం కొత్త వర్షం నీటికి చెరువు నుండి చేపలు వేరొక దారికి వైపు వెళ్లి నష్టం చేకూరే అవకాశం ఉందనిచేపల పెంపకం దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొత్తచెరువు : గురువారం రాత్రి కురిసిన వర్షానికి మండల పరిధిలోని కొడపగాని పల్లి, ఇండ్ల వెంకటంపల్లి, తలమర్ల, మీర్జాపురం, బండ్ల పల్లి,గ్రామాలలో సాగుచేసిన టమోటా, దోస, కలంగిర, మామిడి పంటలు దెబ్బతిన్నాయి. ఇండ్ల వెంకంపల్లి రైతు రామ్ గోపాల్ రెడ్డి రూ. 2.10 లక్షలు ఖర్చు చేసి నాలు ఎకరాల పొలంలో కట్టెలు కట్టి టమోటా పంటను సాగు చేశాడు. కోత కోసే సమయంలో అకాల వర్షాలకు దాదాపు ఒకటిన్నర ఎకరాలో టమోటా పంట దెబ్బతింది. దీంతో తనకు లక్ష రూపాయల దాకా నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. అదేవిధంగా మీర్జాపురం గ్రామంలో రూ.8 లక్షలు వెచ్చించి మామిడి తోటను కొనుగోలు చేశానని యర్లంపల్లి రామచంద్ర తెలిపారు.రాత్రి కురిసిన గాలి వానకు మామిడికాయలు రాలిపోయాయని దీంతో పంట నష్టం దాదాపు రూ.1.80 లక్షల దాకా ఉంటుందని ఆయన వాపోయారు.